

గిరిజనులకు తప్పని డోలీ మోతలు

ప్రజాశక్తి -అనంతగిరి:మారుమూల గిరిజన గ్రామాలలో రోడ్డు సౌకర్యాలు లేక గిరిజన ప్రజలకు డోలీ మోతలు తప్పలేదు. మండలంలోని పిన్నకోట పంచాయతీ రాచకిలం గ్రామానికి చెందిన సూకురు. బాబురావు (18) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సరైన వైద్య సేవలు అందక తీవ్ర అస్వసతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు శనివారం దుప్పటి సహాయంతో డోలీ కట్టి సుమారు ఆరు కిలోమీటర్ల దూరం కొండ కోనల మధ్య దూరంలో ఉన్న పిన్నకోట ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మారుమూల గ్రామాలకు కనీస రోడ్డు సగరు లేకపోవడంతో రోగులకు సకాలంలో సరైన వైద్య సేవలు అందలేదు.



డోలీలో తరలిస్తున్న బంధువులు

అంబేద్కర్‌కు వినతులు

-సిఎం జగన్ తమ డిమాండ్లను నెరవేర్చేలా చూడాలని వేడుకోలు
-కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



పాడేరులో అంబేద్కర్ చిత్రపటం వద్ద వేడుకుంటున్న అంగన్‌వాడీలు



కూనవరంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు శుక్రవారం సమ్మెను కొనసాగించారు. విజయవాడలో సిఎం జగన్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా జిల్లాలో అంగన్‌వాడీలు నిరసనలు చేపట్టారు. సిఎంకు మంచి బుద్ధిని ప్రసాదించాలని అంబేద్కర్ విగ్రహాలకు వినతులు సమర్పించారు.

డుంబ్రిగుడ: మండలంలో అంగన్వాడీ కార్మికులు సమ్మెను కొనసాగించారు. శుక్రవారం మండల కేంద్రంలోని హైవే రోడ్డు యూనియన్ బ్యాంక్ జంక్షన్ వద్ద ఆందోళన చేపట్టి అనంతరం అంబేద్కర్ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పిస్తూ తమ నిరసనన్ని ప్రభుత్వానికి తెలియజేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు, పి.సురేష్ కుమార్, సత్యనారాయణ అంగన్వాడి కార్మికుల చేపడుతున్న ఆందోళన శిబిరంలో పాల్గొని సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే.కొండమ్మ, సత్యవతి, జీ.పవిత్ర, మీనా, బుజ్జి పాల్గొన్నారు.

పాడేరు: జిల్లా కేంద్రంలో ఐటీడీఏ ఎదుట నిరవధిక దీక్షను అంగన్వాడీలు 39వ రోజు యధావిధిగా కొనసాగించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే స్పందించాలని అంగన్వాడి వర్కర్లు హెల్పర్లు పెద్ద ఎత్తున నిర్మించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జయ చిన్నారి, విజయ, సత్యవతి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అంగన్వాడీలు పాల్గొన్నారు.



అనంతగిరిలో...

అరకులోయ:అరకులోయలో అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యందర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, సామాజిక న్యాయం కోసం పోరాడిన అంబేద్కర్ విగ్రహాన్ని విజయవాడలో ఆవిష్కరించడాన్ని హర్షిస్తున్నామన్నారు. లక్ష మంది పైగా ఉన్న అంగన్‌వాడీ మహిళలకు న్యాయం చేయకుండా సామాజిక న్యాయం చేస్తామనడంలో అర్థం లేదని తెలిపారు. అంగన్వాడీలను ఉద్యోగాల నుంచి తొలగిస్తు న్నామని నూతన నోటిఫికేషన్ ఇస్తున్నామని బెదిరింపులకు పాల్పడటం అత్యంత దుర్మార్గమైన ఆలోచన అని ఆయన విమర్శించారు. అంగన్వాడీలు అంబేద్కర్ విగ్రహం ముందు సత్యాగ్రహం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు వెంకటలక్ష్మి, లక్ష్మి, నిర్మల, భారతి, భవాని, సీత, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: మండల కేంద్రంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలోఅంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు టి.రాజమ్మ, మంగమ్మ, పద్మ, కొండమ్మ, సుశీల పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలో అంగన్‌వాడీలు సమ్మెను కొనసగించారు. ఈ సందర్భంగా సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, అంగన్‌వాడీలు రోడ్డెక్కి పోరాటం చేస్తుంటే నిర్బంధం చేసి అణచివేసే ధోరణితో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. సామాజిక న్యాయం అంటూ ఏ మొహం పెట్టుకొని అంబేద్కర్ విగ్రహాన్ని సిఎం ఆవిష్కరించారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ప్రాజెక్టు కార్యదర్శి పెంటమ్మ, లక్ష్మి, అక్కమ్మ, ఇందు, చెల్లయమ్మ వరలక్ష్మి పాల్గొన్నారు.

అనంతగిరి:తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం నుంచి సిఐటియు ఆధ్వర్యాన అంగన్‌వాడీ కార్యకర్తలు మూడు రోడ్ల జంక్షన్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా నిర్వహించారు అనంతరం అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సర్పంచ్ కె.మొస్య. అంగన్వాడి యూనియన్ మండల నాయకురాలు పి.మంజుల, సిఎస్ కళావతి పాల్గొన్నారు

అంబేద్కర్ విగ్రహారం వద్ద సత్యాగ్రహం

చింతూరు:తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని 39వ రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు శుక్రవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం దగ్గర సత్యాగ్రహ దీక్షలు చేపట్టారు. ఇందులో పాల్గొన్న సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ 39 రోజుల నుండి అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్, సిఐటియు నాయకులు పొడియం లక్ష్మణ్, యూనియన్ నాయకులు నూకరత్నం, వెంకటరమణ, కామేశ్వరి, సత్యవతి, విజయకుమారి, సఫీ, లలిత, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండల కేంద్రం రేఖపల్లి సెంటర్లో 39 రోజులుగా దీక్షలు చేస్తున్న అంగన్వాడీలు శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి తమ నిరసన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో కార్మికులకు, మహిళలకు కల్పించిన హక్కులను కాపాడాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు సున్నం రంగమ్మ, యూనియన్ నాయకులు నాగమణి, రాజేశ్వరి, కనకమహాలక్ష్మి, ప్రజా నాట్యమండలి నాయకులు సిహెచ్ సుబ్బారావు పాల్గొన్నారు.



రంపచోడవరంలో..

అడ్డతీగల : 39వ రోజు అంగన్వాడీల ఆందోళనల్లో భాగంగా స్థానిక మండల కేంద్రంలో అంగన్వాడీలు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించారు. ప్రభుత్వ మొండి వైఖరి విడనాడి సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి నిర్మల, బేబీ రాణి తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం : స్థానిక తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె నేటికీ 39వ రోజుకు చేరుకుంది. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందించారు.

రాజవొమ్మంగి : అంగన్వాడీలు శుక్రవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సత్యాగ్రహ దీక్షలు చేపట్టారు. అంగన్వాడీల దీక్షకు గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, మండల కార్యదర్శి కొండ్ల సూరిబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి రామరాజు, డివైఎఫ్ఐ నాయకులు టి శ్రీను తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు చిన్ని కుమారి, కె వెంకటలక్ష్మి, ఎల్ సత్యవతి, రమణి, రమణ, రత్నం, చిన్నమ్మలు, సుందరమ్మ, నాగమణి, రాధ, భవాని, రాజేశ్వరి, లక్ష్మి, వీరయ్యమ్మ, వీరలక్ష్మి, పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

కూనవరం : సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, జగన్మోహన్ ఇచ్చిన హామీని అమలు చేయాలని, పని భారం తగ్గించాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలని కోరుతూ అంగన్వాడీల ఆందోళన 39వ రోజ్తు కొనసాగింది. అనంతరం కూనవరం సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కొమరం పెంటయ్య, యనియన్ నాయకులు అన్నపూర్ణ, లలిత, అంజమ్మ, ప్రసన్న, అంగన్వాడీలు, తాళ్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండల కేంద్రంలో 39వ రోజు ఆందోళన కార్యక్రమం శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్లు నెరవేర్చడంలో అలసత్వం ప్రదర్శిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బుజ్జిబాబు, యూనియన్ అధ్యక్షులు ఎల్. సత్యవతి ఎస్. అప్పలనసమ్మ తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిలో మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్



పెదబయలులో..



విజేతగా నిలిచిన దామనాపల్లి జట్టు సభ్యులు

వాలీబాల్ పోటీల విజేత దామనాపల్లి

ప్రజాశక్తి-సీలేరు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా జీకే వీధి మండల స్థాయి వాలీబాల్ ఫైనల్ పోటీల్లో దేవరపల్లి పంచాయతీ జట్టుపై దామనాపల్లి పంచాయితీ జట్టు గెలుపొంది విజేతగా నిలిచింది. 16 పంచాయతీల నుండి వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన దామనాపల్లి జట్టుకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలోనూ గెలుపొందాలని ఆక్షాంక్షించారు. సచివాలయ కార్యదర్శి గడుతూరి కళ్యాణ్ కృష్ణ మాట్లాడుతూ క్రీడల్లో యువత రాణించినప్పుడు ఉన్నత శిఖరాలు అందిపుచ్చుకోవచ్చునని తెలిపారు. దేవరాపల్లి సెక్రెటరీ వెంకటేశ్వర్లు, దామనపల్లి ఇంజనీరింగ్ అసిస్టెంట్ యుగంధర్, లకవరపేట డిజిటల్ అసిస్టెంట్ మద్దెల ప్రసాద్, ఇతర సచివాలయ సిబ్బంది దామనాపల్లి జట్టును అభినందించారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-అడ్డతీగల

మండల కేంద్రంలోని దేవిగుడి సెంటర్ వద్ద స్థానిక తహసిల్దార్ తాతారావు, రెవెన్యూ సిబ్బంది ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై మండల ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంపై ఓటు వేసిన తర్వాత ఓటు వేసి ముద్ర కనిపించే విధంగా ఈసారి ఎలక్షన్‌లో యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, దీన్ని ప్రతి ఓటరు గుర్తించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఓటును నమోదు చేసుకుని, 100శాతం ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మోహన్, విఆర్వో బాలయ్య, జూనియర్ అసిస్టెంట్ భాను ప్రకాష్, వీఆర్ఏలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ అధికారులు

ఆర్థిక బకాయిలు చెల్లించాలని
యుటిఎఫ్ నిరసనలు



చింతూరులో నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -చింతూరు

రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్న రూ.18,096 కోట్లు వెంటనే చెల్లించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం చింతూరు ఆశ్రమ బాలికల పాఠశాల నుంచి శబరి బ్రిడ్జి వరకు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని మౌన ప్రదర్శన చేశారు. చింతూరు మెయిన్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం ముందు మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పండా కిష్టయ్య మాట్లాడుతూ ఎపిజిఎల్ఐ లోన్ బకాయిలు, డిఎ, పిఆర్‌సి ఎరియర్స్ చెల్లించాలని, సరెండర్ లీవ్, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు కె.కాంతమ్మ, శ్రీలత, సునీత, తులసి, సుజాత, హరినాథ్, ప్రభాకర్, కన్నారావు, ముత్తయ్య, సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.



అడ్డతీగలలో..

అడ్డతీగల : ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావలసిన పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ అడ్డతీగల తహశీల్దారు కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. మధ్యలో దేవి గుడి వద్ద రోడ్డుపై మోకాళ్ళపై బైఠాయించి బకాయిలు చెల్లించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఉపాధ్యాయుల పట్ల, ఉద్యోగుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని వారు ఖండించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి కె.కృష్ణ, జిల్లా కార్యదర్శి జి తేజరావు, రాష్ట్ర కౌన్సిలర్ బి వెంకటలక్ష్మి, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ పి.మంగరాజు, అడ్డతీగల, గంగవరం, వై.రామవరం, రాజవొమ్మంగి మండలాల యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కేవీ రాఘవులు, కే శ్రీనివాస్ దొర, సిహెచ్ రాంబాబు దొర, సిహెచ్ వెంకటేశ్వరరావు, డి. పైడిమల్లి, ఎన్ వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాడేరు: ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ జీతంలో నెల వారిగా కొంత మొత్తం ఎపిజిఎల్ఐ, పిఎఫ్ ఖాతాల్లో దాచుకున్న సొమ్మును తమ ఆర్థిక అవసరాలకు అడిగినప్పుడు వారం లేదా పది రోజుల్లో చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఎపిజి ఎల్ఐ, పిఎఫ్ లోన్లు, సరెండర్ లీవులు, డిఎ ఎరియర్లు చెల్లించకుండా ఉద్యోగ, ఉపాధ్యాయల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యుటి ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం పాడేరు జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక పక్క ఫ్రెండ్లీ ప్రభుత్వం అంటునే సకాలంలో జీతాలు చెల్లించకుండా ఇబ్బంది పెట్టడం, పనిచేసిన కాలానికి నెల చివరి రోజున జీతాలు చెల్లించకుండా ట్రెజరీ రూల్స్‌ని ప్రభుత్వమే ఉల్లంఘించి ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇబ్బంది పెట్టడం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలు పరిష్కారం చేయకపోతే ఈ నెల 24న జిల్లా స్థాయిలో ఆందోళనలు చేస్తామని జిల్లా సహా అధ్యక్షులు చీకటి నాగేశ్వరరావు వెల్లడించారు. ఈకార్యక్రమంలో జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.గంగాధర్, కళారావు ఎస్ హరిష్, కె.రాజారావు, జె.పద్మనాభం, ఎన్. కొండబాబు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాడేరు ఐటిడిఎ కార్యాలయం ఎదుట...

అరకులోయ : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మండల కేంద్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని కోరుతూ తసిల్దార్ కార్యాలయం నుండి ఎన్టీఆర్ గార్డెన్ వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగ వైద్య సంఘాల నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం ఉద్యోగుల పట్ల మొండి వైఖరితో పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అల్లూరి జిల్లా యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు చిట్టిబాబు, కార్యదర్శి దేముడు, రఘునాథ్ డిమాండ్ పాల్గొన్నారు.



అరకులోయలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం



రాజవొమ్మంగిలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని తంటికొండ పంచాయితీ ఒట్టిగడ్డ గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. రాజవొమ్మంగి వైద్యాధికారులు జి సుస్మా, జి నాగార్జున 152 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామాల్లో ప్రజలకు ఏయే వైద్య సేవలు అందుతున్నాయో వైద్యులు వివరించారు. రోగులకు, గర్భిణులకు, బాలింతలకు పలు సూచనలు చేశారు. ఇందులో పాల్గొన్న తంటికొండ సర్పంచ్ ఆగూరు సుబ్బలక్ష్మి, స్థానిక ఎంపీడీవో విజయ రంగారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లో వైద్య సేవలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సిహెచ్ ప్రసాద్, సోమరాజ రెడ్డి, రమాబాయి, అప్పలరాజు, వెంకటలక్ష్మి, సన్యాసమ్మ, కృష్ణకుమారి, సుజాత, ఆశావర్కర్లు అమ్మిరాజు, చల్లయమ్మ, దుర్గ, కుమారి, ఉప సర్పంచ్ పల్లి వెంకటరమణ, ఎంపీటీసీ ఏ నిర్మలాదేవి, పంచాయతీ కార్యదర్శి షేక్ నసూర్ వల్లి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు ఎస్‌కే.ఖాదర్ మస్తాన్ వల్లి, కె.సౌమ్య మాట్లాడుతూ నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనతపై ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. సీజన్ వారి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో చిల్డ్రన్ స్పెషలిస్ట్ డాక్టర్ ప్రభావతి, పెథాలజీ వైద్యాధికారి వి.రమేష్, ఆప్తమాలజీ వైద్య నిపుణులు ఎన్. చెన్నారావు, ఎంపీహెచ్‌ఈఓ బి.జ్యోతి బాబు హెల్త్ సూపర్వైజర్ ఎన్.త్రినాథ, బి. బాలామణి, టీవీ సూపర్వైజర్ అశోక్, ఎస్‌టిఎల్ ఎస్ వెంకట్రావు, పంచాయితీ కార్యదర్శి ఎం.సోమరాజు, డిజిటల్ అసిస్టెంట్ వి.మల్లేశ్వరరావు, వెల్ఫేర్ కార్యదర్శి కె.జైరామ్, మహిళా పోలీస్ టి. ఈశ్వరి, హెల్త్ సెక్రెటరీ బి.దేవి, ల్యాబ్ టెక్నీషియన్ శివ, సాయి పాల్గొన్నారు.



జికె.వీధి మండలం దుప్పిలవాడలో వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న ప్రసాద్

బహిరంగ సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -హుకుంపేట: తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు తల పెట్టిన రా కదిలిరా అనే కార్యక్రమంలో భాగంగా అరకులో ఈనెల20న చేపట్టే భారీ బహిరంగ సభకు కదలి వచ్చి విజయ వంతంగా చేయాలని టిడిపి మండల అబ్జర్వర్ పాసర్ల ప్రసాద్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల పార్టీ ప్రెసిడెంట్ తులసిరావు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వర్గ భేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. పార్టీ బలోపేతం చేసేందుకు అందరూ శ్రమించాలన్నారు. రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావాలన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శెట్టి లక్ష్మణుడు, సర్పంచ్‌లు వెంగళ ప్రదీప్, జాకరు వెంకటరమణ రాజు, పాడి బాలన్న, టీడీపీ సీనియర్ నాయకుడు బొడ్డ శ్యామ్, అరకు అసెంబ్లీ యస్‌టి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొర్రా సంతోష కుమార్, అరకు అసెంబ్లీ యూనిట్ ఇంఛార్జి సోమేలి లక్ష్మయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఎస్.సూర్యకాంతం పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

వైస్ ఎంపిపికి పరామర్శ

ప్రజాశక్తి హుకుంపేట: సిపిఎం వైస్ ఎంపిపి సుడిపల్లి కొండలరావును ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, అనంతగిరి జడ్పిటీసీ దీసారి గంగరాజు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్‌లు పరామర్శించారు. స్వగ్రామమైన గన్నేరు పుట్టు పంచాయతీ డొంకిన వలస గ్రామంలో కొండలరావు తల్లి లచ్చమ్మ పార్థీవ దేహానికి నివాళులు అర్పించారు. పరామర్శించిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి వి.లక్ష్మణ్‌రావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.కృష్ణారావు, మాజీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కె.రమణమూర్తి, సర్పంచ్ వెంకట్, ప్రసాద్, బుజ్జిబాబు ఉన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి -పిఎం పాలెం : కొమ్మాది సమీపంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో రానున్న విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు నవోదయ ప్రిన్సిపల్ కె.సంజయ్ తెలిపారు. శనివారం ఉదయం 11.30 నుంచి 1.30 వరకు నిర్వహించే ఈ పరీక్ష కోసం విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 44 కేంద్రాలను ఏర్పాటుచేశామని చెప్పారు. 8107 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలకు 10.45 గంటలకు చేరుకోవాలని, 11.30 తరువాత వచ్చే అభ్యర్థులను అనుమతించరని స్పష్టంచేశారు. పరీక్షను బ్లూ లేదా బ్లాక్ కలర్ బాల్ పాయింట్ పెన్‌తో రాయాలని తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాలను, ఇతర కాగితాలు, జామెట్రీ బాక్సులను అనుమతించరని పేర్కొన్నారు. ప్రతి కేంద్రంలో నిర్వాహకులతో పాటు ఒక పరిశీలకుడు ఉంటారని తెలిపారు. ప్రశ్న పత్రాలు ఒకగంట ముందు మాత్రమే పరీక్షా కేంద్రాలకు బ్యాంకుల నుంచి ప్రత్యేక అధికారులు చేరవేస్తారని చెప్పారు. ఇన్విజిలేటర్లను లాటరీ పద్ధతిలో ఎంపికచేసి పంపించనున్నట్లు తెలిపారు.

జంపింగ్ జపాంగ్‌లు

- కండువాలు మార్చుతున్న నాయకులు

- ఉమ్మడి విశాఖ జిల్లాలో అధికార పార్టీకి పెద్ద దెబ్బే !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎన్నికల సమయం సమీపిస్తున్న వేళ.. ఉమ్మడి విశాఖ జిల్లాలోని నియోజకవర్గాల్లో ఆశావహుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఈ క్రమంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేనల్లో 'జంపింగ్ జపాంగ్'లు ఒక చోట నుంచి మరోచోటుకు స్పీడుగా కదులుతున్నారు. ఇక గోడమీద పిల్లి వాటాలు పనికి రావు.. ఆ గట్టో ఈ గట్టో తేల్చుకోకపోతే రాజకీయంగా నష్టపోతామన్న ఆందోళనతో పలువురు నాయకులు హుటాహుటిన 'కండువాలు' మార్చేస్తున్నారు. వైసిపిని ముఖ్య నాయకులంతా వీడడం ఈ కాలంలో ప్రధాన రాజకీయ పరిణామంగా ఉంది. ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లలో సీట్లను ఆశించి భంగపడిన వారంతా ఠక్కున టిడిపి లేదా జనసేన పార్టీ కండువాను కప్పుకోవడం పరిపాటిగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా అధికార పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గాల్లో బరిలో ఎవరుండాలన్న అంశంపై తాజాగా తీసుకున్న నిర్ణయాలు, ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థానిక పరిస్థితులూ కొంత తోడై వైసిపికి ముఖ్యనేతలంతా గుడ్‌బై చెబుతున్నారు. అలాంటి వారిలో విశాఖ జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన పంచకర్ల రమేష్‌బాబు ముందే జనసేన పార్టీలో చేరగా, ఇటీవలే ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ వైసిపిని వీడారు. విశాఖలో ప్రారంభం నుంచీ వైసిపి వెంట నడిచి ఆ పార్టీలో వంశీకృష్ణ కీలకంగా వ్యవహరించారు. తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టికెట్‌ను ఎంపీ ఎంవివి సత్యనారాయణకు వైసిపి అధిష్టానం ఖరారు చేయడంతో వంశీ పార్టీని వీడారు. తాజాగా బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్ దక్షిణ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వ్యవహారశైలిపై విసుగెత్తిపోయి బయటకొచ్చారు. ఆయన సహా పలువురు కార్పొరేటర్లు, కేడర్ సీతంరాజు వెంట నడుస్తున్నారు. అనకాపల్లి జిల్లా నుంచి దాడి వీరభద్రరావు కుటుంబం మొత్తంగా టిడిపి తీర్థం పుచ్చుకుంది. విశాఖలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్ వైసిపిలో ఉన్నా పూర్తిగా తటస్థంగా ఉన్నారు.

వైవి.సుబ్బారెడ్డినే కారణమా ?

ఉత్తరాంధ్ర రీజియన్ వైసిపి సమన్వయకర్తగా వైవి.సుబ్బారెడ్డి వచ్చాక పార్టీలో ఏ పరిస్థితినీ చక్కదిద్దలేకపోవడం, వార్డులు, గ్రామాలు, నియోజకవర్గాల్లో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో వైసిపిని అత్యధిక మంది ఈ కాలంలో వదిలినట్లు ఆ పార్టీలో తాజాగా పెద్ద చర్చనే జరుగుతోంది. విశాఖలో మధ్యతరగతి, ఉద్యోగులు ఇప్పటికే వైసిపికి వ్యతిరేకంగా అభిప్రాయాలు చెప్పడం తెలిసిందే. 2019లో నగరంలోని నాలుగు సెగ్మెంట్లును వైసిపి కోల్పోయింది. తాజాగా కూడా ఇదే పరిస్థితి నెలకొందన్న చర్చ ఆ పార్టీలో సాగుతోంది. పార్టీలో అంతర్గత కుమ్ములాటలను, నియోజకవర్గాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలను గతంలో ఈ ప్రాంత వైసిపి సమన్వయకర్తగా వ్యవహరించిన విజయసాయిరెడ్డి చాకచక్యంగా పరిష్కరించడమే కాకుండా కార్పొరేషన్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకునే దిశగా పావులు కదిపారని వైసిపి శ్రేణులు, పార్టీని వీడిన నేతలు సైతం చెప్పుకొస్తున్నారు. వైవి.సుబ్బారెడ్డి బాధ్యతలు తీసుకున్నాక వైసిపికి పలువురు రాజీనామాలు చేయడం, తిరుగుబావుటా ఎగరేయడం వంటివి పెరిగిపోయాయి. ఏం చెప్పినా విని ఊరుకుంటారని, సమస్యలను పరిష్కరించాలన్న చొరవ చేయరని ఆయనపై విమర్శలు ఉన్నాయి. విశాఖలో పార్టీని పలువురు వీడిపోవడానికి రాష్ట్ర అధిష్టానం కొంత కారణమైతే.. వైవి.సుబ్బారెడ్డి ఇక్కడ అడుగుపెట్టిన నుంచీ వ్యవహరిస్తున్న తీరూ మరొక కారణమని అధికార పార్టీ సీనియర్ నాయకులు వాపోతున్నారు. విశాఖలో వైసిపిలో చేరిన ఇండిపెండెంట్ కార్పొరేటర్లు ఇద్దరు ఇటీవలే జనసేనలో చేరగా, తాజాగా దక్షిణ నియోజకవర్గంలో పార్టీ వ్యతిరేక గ్రూపులు నడుపుతున్నారని నలుగురు కార్పొరేటర్లను సైతం ఆ పార్టీ సస్పెండ్ చేయడంతో వైసిపి ఇక్కడ ఎదురీదే పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఈ పరిణామాలన్నిటినీ తెలుగుదేశం, జనసేన పార్టీలు తీక్షణంగా పరిశీలిస్తూ 2024 ఎన్నికల్లో ఎవరెక్కడ ఎలా ఉపయోగపడతారోనన్న ప్రణాళికలతో కదులుతున్నాయి. సీట్లను ఆశిస్తూ టిడిపి గట్టున చేరిన వారు 'జంపింగ్ జపాంగ్'ల్లో గణనీయంగా ఉండడంతో తమకీ భవిష్యత్తులో తలనొప్పులు తప్పవని టిడిపి అధిష్టానం భావిస్తున్నట్లు భోగట్టా.

తపాలా ఏజెంట్ల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తపాలా శాఖ అందిస్తున్న జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా సేవలను విస్తృతం చేసేందుకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విశాఖపట్నం సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసు గజేంద్ర కుమార్ మీనా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వివరించారు. పూర్తి వివరాల కోసం 8143810007 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

స్పందన ఫిర్యాదులు సకాలంలో పరిష్కారం

కలెక్టర్ సుమిత్ కుమార్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న స్పందన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ముందస్తు అనుమతి పొంది మాత్రమే కింది స్థాయి సిబ్బందిని పంపాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో జరిగిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఫిర్యాదుదారుల నుండి 51 విన్నపాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్పందన లో అందిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి విచారణాధికారిని నియమించాలని, సమస్య పరిష్కారానికి చొరవ చూపి, పరిష్కార చర్యల సంబంధిత ఫిర్యాదుదారునికి తెలియజేయాలని ఆదేశించారు. అదేవిధంగా జగనన్నకు చెబుదాం పోర్టల్ లో అందిన ఫిర్యాదులపై కూడా సకాలంలో స్పందించాలని ఆదేశించారు. కొంతమంది అధికారులు సకాలంలో లాగిన్ అవ్వక పోవటం, సమస్య పరిష్కారం కాకుండా ఐనట్లు అప్లోడ్ చేయడం లాంటివి గుర్తించామని, అటువంటి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం, 26 న గణతంత్ర దినోత్సవ వేడుకలలో అందరూ పాల్గొనాలని కలెక్టర్ కోరారు.

25న సెల్ టవర్ల ప్రారంభం

ఈ నెల 25న జిల్లాలో 300 సెల్ టవర్ల ప్రారంభాన్ని రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్ మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ తెలిపారు. పాడేరు మండలం ఈదులపాలెం, దుంబ్రిగుడ మండలం లయగండలో వర్చువల్‌గా ప్రారంభం ఏర్పాట్లు చేస్తున్నట్లు అభిషేక్ వివరించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ కె.కార్తిక్, సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, డిఆర్ఓ వి.వి.రమణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్పందనలో ఫిర్యాదులు

ఎటపాక మండలం చింతల గూడెం గ్రామానికి చెందిన అంబటి వరలక్ష్మి తన వ్యవసాయ భూమిని వెబ్ లాండ్‌లో నమోదు చేయాలని వినతి పత్రం సమర్పించారు. జి.మాడుగుల మండలం బీరం పంచాయతీ వి.కూడాపల్లి గ్రామస్తుడు బి. సింహాద్రి చావిడి వీధిలో సిసి రోడ్డు నిర్మించాలని కోరారు. [illegible] మండలం లాగరాయి పంచాయతీ స్కూల్లో రెండో విడత నాడు నేడు పనులు చేశారని, బిల్లులు విడుదల చేయాలని వి. బాలకృష్ణ వినతిపత్రం అందజేశారు. రాజవొమ్మంగి మండలం కాలనీకి చెందిన జి.నాగరాజు లక్ష్మిపురం గ్రామ చెరువు దురాక్రమనకు గురవుతోందని వినతిపత్రంలో కోరారు.పాడేరు మండలం గొండెలి పంచాయతీ పిల్లిపుట్టి గ్రామస్తులు ఎస్.రంజిత్, ఎస్. వికాస్ గొండెలి నుండి పిల్లిపుట్టి గ్రామం వరకు మెటల్ వేసి వదిలేసారని రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. ఎటపాక మండలం చిన్న నల్లబల్లు గ్రామానికి చెందిన బొల్ల సత్యనారాయణ తన వ్యవసాయ భూమిని వెబ్ ల్యాండ్ లో నమోదు చేయాలని వినతి పత్రం అందజేశారు.

21న మోదకొండమ్మ తీర్థం

ముగ్గుల పోటీలు.. సారె ఊరేగింపు

సాంస్కృతిక ప్రదర్శనలతో పల్లకి సేవ

ప్రజాశక్తి-పాడేరు: మన్యం ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ అమ్మవారి సంక్రాంతి తీర్థ మహోత్సవం ఈనెల 21న ఆదివారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు మోదకొండమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు వెల్లడించారు. ఆలయ కమిటీ ఛైర్పర్సన్ స్థానిక శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ తీర్థ మహోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. శుక్రవారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ, తీర్థ మహోత్సవానికి నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. ప్రతి ఏడాది సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ తీర్థ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో ముగ్గుల పోటీలను ఏర్పాటు చేస్తామని విజేతలకు ప్రైజ్ మనీ అందజేస్తున్నామని ప్రథమ బహుమతి రూ.6000 ద్వితీయ బహుమతి 4000, తృతీయ బహుమతి మూడువేల చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన ఔత్సాహికులైన పట్టణంలోని మహిళలు, ముందుగానే ఆలయం వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని అధిక సంఖ్యలో భక్తులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అమ్మవారి ప్రసాద పంపిణీ మరియు వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాలను ఆలయ కమిటీ ఛైర్ పర్సన్ శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి దంపతుల చేతుల మీదుగా నిర్వహిస్తామని చెప్పారు. పట్టణంలోని కాపు సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి సారే సమర్పణ ఊరేగింపుగా సాగుతుందని చెప్పారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహం అమ్మవారి పాదాలను భక్తుల సందర్శనార్థం పురవీధుల్లో ఊరేగిస్తామని ప్రత్యేక నేల వేషాలు బాణాసంచా అమ్మవార్ల వేషాలతో అంగరంగ వైభవంగా ఈ పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

బంగారు కిరీటం అలంకరణ ఉత్సవం

వార్షిక సంక్రాంతి తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని మోదకొండమ్మ అమ్మవారికి భక్తులు అందించిన బంగారు కానుకలతో తయారు చేసిన బంగారు కిరీటాన్ని అలంకరణ ఉత్సవం ఆలయ కమిటీ ఛైర్పర్సన్ స్థానిక శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు తమర్బ నర్సింగ్‌రావు దంపతుల చేతుల మీదుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు భక్తులందరూ తరలివచ్చి ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఆధ్యాత్మిక సేవ బృందం సభ్యులు ఈ తీర్థ మహోత్సవంలో భాగంగా జరిగే ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాలు పంచుకోవాలని కోరారు.

పరిహారం ఊసేలేదు

మిచౌంగ్ తుపానుకు 16,472 ఎకరాల పంట నష్టం

నివేదికను పట్టించుకోని ప్రభుత్వం

సాయం కోసం బాధిత రైతుల ఎదురుచూపు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

మిచౌంగ్ తుపాను డిసెంబరులో రైతును కోలుకోలేకుండా చేసింది. పంట నష్టపోయిన రైతును ఆదుకుంటామని భరోసా ఇచ్చిన ప్రభుత్వం రోజులు గడుస్తున్నా దాని ఊసే ఎత్తడం లేదు. సాంకేతిక కారణాల సాకుతో వాస్తవిక పంట నష్టం కంటే వ్యవసాయశాఖ తక్కువ నష్టం అంచనావేసి ప్రభుత్వానికి నివేదించింది. అయినా ఇంతవరకూ సర్కారు రైతుకు పంటనష్ట పరిహారం చెల్లించలేదు. సంక్రాంతి పండగకు ముందు పరిహారం అందితే కుటుంబ అవసరాలు తీరుతాయని రైతులు భావించారు. పండగ తరువాతైనా డబ్బులు పడితే పండగకు చేసిన అప్పులు తీర్చుకుంటామని అనుకున్నారు. చివరకు ప్రభుత్వం రైతుకు నష్టపరిహారం ఇవ్వకపోవడంతో వారంతా నిరాశలో ఉన్నారు.

జిల్లాలో గత డిసెంబరులో వచ్చిన మిచౌంగ్ తుపానుతో 27,833 మంది రైతులకు చెందిన 16,413 ఎకరాల్లోని రూ.11.16 కోట్ల విలువైన వరి పంటకు నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ ప్రభుత్వానికి నివేదించింది. 123 మంది చెరుకు రైతులకు చెందిన 58.92 ఎకరాల్లో నాలుగు లక్షల విలువైన పంట దెబ్బతిన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వ్యవసాయశాఖ పంట నష్టం వివరాలను నివేదించినా ఇంతవరకు పరిహారం రైతుకు ఇవ్వలేదు.

జిల్లాలో గతేడాది ఖరీఫ్‌లో 2.04 లక్షల ఎకరాల్లో సాగు కావాల్సివుంది. తీవ్రమైన కరువు పరిస్థితులతో 1.35 లక్షల ఎకరాల్లో పంట నమోదైంది. ఇందులో వరి 1.36 లక్షల ఎకరాలకు 1.10 లక్షల ఎకరాల్లో సాగైంది. అక్టోబర్‌లో వర్షాల్లేకపోవడంతో ఐదు వేల ఎకరాలకు పైగా వరి పంట ఎండిపోయింది. జిల్లాలోని 24 మండలాలకు 25 నుంచి 50 శాతం మధ్య వర్షపాతం లోటు 12 మండలాల్లో ఏర్పడింది. నక్కపల్లి, పాయకరావుపేట, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల్లో 50 శాతానికి మించి వర్షపాతం లోటు ఏర్పడినా ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించలేదు. వరి పంట కోసిన సమయంలో భారీ తుపాను రావడంతో దాదాపు 25 వేల ఎకరాలకు పైగా పంట నష్టం జరిగింది. కోసిన వరి నీటితో తడిసింది. కోయాల్సిన పంట గాలులకు పడిపోయి, నీటమునిగింది. దీంతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. చేతికి రావాల్సిన పంట కళ్లముందే నీళ్లపాలైంది. పెట్టిన పెట్టుబడులకు పంట చేతికిరాలేదు. అయినా ప్రభుత్వం వీటిని పరిగణనలోకి తీసుకోలేదు. వాస్తవిక పంట నష్టం కుదించి పరిహారం ఇచ్చేందుకు తగిన సాంకేతిక నిబంధనలు రూపొందించింది. 33 శాతానికిపైగా నష్టపోయిన పంటను వ్యవసాయశాఖ గుర్తించి 16,413 ఎకరాల్లో వరి, 58.92 ఎకరాల్లో చెరకు పంట దెబ్బతిన్నట్లు ప్రభుత్వానికి నివేదించింది. నెల గడిచినా సర్కారు నుంచి పరిహారం రైతుకు అందలేదు. వ్యవసాయశాఖాధికారులు మాత్రం పంట నష్టపోయిన రైతులకు త్వరలో ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందని చెబుతున్నారు.



చీడికాడలో తడిసిన పంటను చూపుతున్న రైతులు (ఫైల్‌ఫొటో)

నేడు లోక్‌నాయక్ పురస్కారాలు ప్రదానం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన పలువురు ప్రముఖులకు ఎన్‌టిఆర్ వర్ధంతి, ఎఎన్ఆర్ శత జయంతి కార్యక్రమాలను పురస్కరించుకొని లోక్‌నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీవన సాఫల్య పురస్కారాలను ప్రదానం చేయనున్నట్టు ఫౌండేషన్ అధ్యక్షులు, రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఎయు హిందీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 10.30 గంటలకు రుషికొండ భీమిలి బీచ్ రోడ్డులోని ఎ1 గ్రాండ్ కన్వెన్షన్‌లో ఈ కార్యక్రమం ప్రతిష్మాత్మకంగా నిర్వహిస్తామన్నారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 'పద్మభూషణ్' సత్కార గ్రహీత, ప్రముఖ సినీ నటుడు కొణిదెల చిరంజీవి హాజరవుతారన్నారు. సభాధ్యక్షులుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఆకుల శేషసాయి వ్యవహరిస్తారన్నారు. గౌరవ అతిథులుగా 'పద్మభూషణ్' సత్కార గ్రహీత, పూర్వ హోం కార్యదర్శి, ప్రధానమంత్రి సలహాదారులు కె.పద్మనాభయ్య, విజ్ఞాన్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ లావు రత్తయ్య, రాష్ట్ర మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజక వర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరవుతారన్నారు ఈ కార్యక్రమంలో లోక్ నాయక్ ఫౌండేషన్ 19 సంవత్సరాలుగా ఎన్‌టిఆర్ పుణ్యతిథి రోజున రూ.2 లక్షల నగదుతో ప్రదానం చేసే సాహిత్య పురస్కారాన్ని యండమూరి వీరేంద్రనాథ్‌కి ఈ ఏడాది ప్రదానం చేస్తామన్నారు. తాము ప్రతి ఏటా ఇచ్చే జీవిత సాఫల్య పురస్కారాలను ముగ్గురు ప్రముఖులకు ప్రదానం చేస్తామన్నారు. బెంగళూరు తెలుగు సమాఖ్య అధ్యక్షులు రాధాకృష్ణం రాజు, ప్రఖ్యాత మనోవైద్యులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, అంతర్జాతీయ పర్యటన శాఖా నిపుణులు, కవి విల్సన్ సుధాకర్ తుల్లుమిల్లికి తమ ఫౌండేషన్ జీవన సాఫల్య పురస్కారాలు ప్రదానం చేస్తామన్నారు. వీరికి తలా 50 వేల రూపాయల నగదు బహుకరించి సత్కరిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో ఫౌండేషన్ సభ్యులు నల్ల బాబయ్య, శివరామ్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

ఉర్లోవను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని ఆదివాసీల ధర్నా

ప్రజాశక్తి-మాడుగుల: ఉర్లోవను రెవెన్యూ వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని మోకాళ్లపై ఆదివాసీలు ధర్నా చేశారు. మండలంలోని బొమ్మలి జగన్నాథపురం పంచాయతీ గడబూరు గ్రామంలో మోకాళ్లపై నిలుచుని శుక్రవారం వినూత్నంగా నిరసన తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కర్రి భవాని, ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరట నరసింహమూర్తి మాట్లాడారు. భూములకు చట్టపరమైన హక్కులు కల్పించాలని, ఉర్లోవ రెవెన్యూ వెబ్లాండ్ రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గ్రానైట్ కంపెనీ నుండి రక్షణ కల్పించాలన్నారు. ఉర్లోవ రెవెన్యూ పరిధిలో 450 ఎకరాల్లో 350 మంది ఆదివాసి గిరిజనులు, ఇతర పేదలు జీడి మామిడి తోటలను సాగు చేస్తున్నారని, వీరికి 2013 సంవత్సరంలో పట్టాలు ఇచ్చారని తెలిపారు. ఉర్లోవ రెవెన్యూ గ్రామం రెవెన్యూ రికార్డులో రెవెన్యూ విలేజ్ మ్యాప్ కూడా ఉండని, అన్ సెటిల్మెంట్ విలేజ్‌గా నమోదు చేశారని, రెవెన్యూ రికార్డు లేకపోవడంతో ఆదివాసి గిరిజనులకు ఇచ్చిన పట్టాలని నమోదు చేయలేదని వారు తెలిపారు. మరోవైపు గ్రానైట్ క్వారీలకు వివిధగా అనుమతులు మంజూరు చేస్తున్నారని వారు విమర్శించారు. అనేకసార్లు ధర్నాలు, ప్రదర్శనలు, నిరసనలు చేపడుతున్నప్పటికీ గిరిజనులపై వివక్ష కొనసాగుతుందన్నారు. భూములకు హక్కులు కల్పిస్తామని, రైతు భరోసా, ఈ క్రాఫ్ట్ బ్యాంకు పంట రుణాలు వంటి పథకాలు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెపుతున్నా.. రెవెన్యూ రికార్డుల్లో నమోదు కాకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించకుంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వంటావార్పు చేపడతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఈదల మచ్చి రాజు, నిమ్మకాయల రాము, గేదెల నూకరాజు, ఈదెల కరుణ, ఖాతా చిలుకు మరియు గిరిజనులు పాల్గొన్నారు.

శ్రీనుకు బెయిల్ ఇవ్వాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: భారత రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను నిరాకరిస్తూ 2019 సంవత్సరం నుండి కోడి కత్తి శ్రీనును బయటకు రాకుండా అడ్డుకుంటున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైఖరిని బహుజన సమాజ్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని నర్సీపట్నం నియోజకవర్గం బిఎస్పీ అభ్యర్థి బొట్ట నాగరాజు తెలిపారు. శ్రీనును జైలులో పెట్టి కుటుంబానికి దూరం చేసారన్నారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, ఆర్టికల్ 19 ప్రకారం నిరసన తెలియజేసే హక్కును నిరాకరించడం తగదన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీన్ని సుమోటోగా స్పందించి శ్రీనుకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఈ కేసును 307గా పెట్టడం సరికాదన్నారు. రాజ్యాంగాన్ని అడుగడుగున ఉల్లంఘిస్తూ మరోపక్క అంబేద్కర్ విగ్రహాలను పెట్టడాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గం అధ్యక్షుడు ఎన్.చిరంజీవి, నియోజకవర్గ కన్వీనర్ కొల్లు గంగాధర, నాయకులు మహేష్ పాల్గొన్నారు.

సిఎం సభకు తరలిరావాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: భీమిలిలో ఈ నెల 25న జరిగే సిఎం జగన్ మోహన్ రెడ్డి సభకు నియోజకవర్గం నుంచి ప్రజలు భారీగా అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ, నియోజకవర్గాల క్రియాశీల కార్యకర్తలతో జగన్ సమావేశం కానున్నారని, ఇదులో భాగంగానే ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. పార్టీలు చూడకుండా జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందించారని ప్రజలంతా మరోసారి జగన్మోహన్ రెడ్డి ని గెలిపిచాలని కోరారు. నర్సీపట్నం నియోజకవర్గం నుంచి 7500 మంది వెళ్లాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి- వడ్డాది: చెరకు రైతుల అభ్యున్నతకి జగన్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని వైస్ ఎంపిపి దొండా లలిత నారాయణమూర్తి కొనియాడారు. బుచ్చయ్య పేటమండలం వడ్డాది చెరుకు కాటా వద్ద ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ, సుగర్ ఫ్యాక్టరీకి రూ.12 కోట్ల గ్రాంట్ రూపంలో రైతులకు నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. సుగర్ ఫ్యాక్టరీనీ ఆదుకున్న జగన్మోహన్ రెడ్డి, ధర్మ శ్రీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కోవెల జనార్దన్ రావు, రమణ, ఈశ్వరరావు, చెరుకు రైతులు నాలం శ్రీరామ్‌మూర్తి, ఈశ్వరరావు, వరహాలు, కొండయ్య, లక్ష్మీ పాల్గొన్నారు

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-రంపచోడవరం : రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ ఆధ్వర్యాన రంపచోడవరం మండలం, సిరిగిందలపాడులోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆవరణలో ఈ నెల 21న ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేమగిరి పరమ హంస యోగానంద నేత్రాలయ వైద్యులు కంటి పరీక్షలు ఉచితంగా చేసి, అవసరమైన వారికి మందులు, కళ్ళ జోళ్ళ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కంటి ఆపరేషన్లు (కాటరాక్ట్) అవసరమైన వారికి పరమ హంస యోగానంద నేత్రలయానికి తరలించనున్నట్లు తెలిపారు. కంటి ఆపరేషన్లు నిమిత్తం వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు తీసుకుని రావాలని సూచించారు. సామాన్య రోగాలు కూడా చూడబడతాయని, ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ తెలిపారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వచ్ఛ భారత్

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని ఐ.పోలవరంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్మించి నిర్వహిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయ పరిసరాలను శుక్రవారం పరిశుభ్రం చేశారు. ఆలయ వేదపండితులు సాయిరాం శర్మ శ్రీవారికి అభిషేక సేవ చేశారు. అనంతరం భక్తులకు రంపచోడవరం వాస్తవ్యులు, వరలక్ష్మి, శ్రీనివాసరావు లక్ష్మి దంపతులు అన్నదానం చేశారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాగణం పరిసర ప్రాంతాలను శుభ్రపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు నారాయణరాజు, పవన్, సిబ్బంది, ధర్మ ప్రచార సేవా భక్త మండలి కో-ఆర్డినేటర్ నల్లమిల్లి వేంకట రామారెడ్డి, సేవాభక్త మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కులగణన ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన ప్రక్రియ శుక్రవారం విశాఖలో ప్రారంభమైంది. తొలిరోజు సర్వే చురుగ్గా సాగింది. జిల్లా పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆయా సచివాలయ సిబ్బంది, ఇతర విభాగాల ఉద్యోగులు భాగస్వామ్యమై డిజిటల్ మోడ్ విధానంలో ప్రజల నుంచి వివరాలు సేకరించారు. కులగణన ప్రక్రియను జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ పర్యవేక్షించారు. పందిమెట్ట ప్రాంతంలో దసపల్లా హిల్స్ సచివాలయ పరిధిలో జరిగిన సర్వేను పరిశీలించిన ఆయన డిజిటల్ రూపంలో వివరాలను సేకరించే తీరును గమనించి పలు సూచనలు చేశారు. ప్రక్రియను సమర్థవంతంగా సజావుగా నిర్వహించాలని, పక్కా వివరాలను సేకరించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. సిబ్బందితో పాటు పలు గృహాలను సందర్శించిన ఆయన స్థానిక ప్రజలతో మాట్లాడారు. పర్యటనలో ఆయన వెంట జోనల్ కమిషనర్ శివప్రసాద్, డిఎల్‌డిఒ పూర్ణిమాదేవి, ఇతర ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న ఆర్‌టిసి కార్మికుల రిలే దీక్షలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆర్‌టిసి కార్మికుల రిలే నిరాహార దీక్షలు రెండో రోజైన శుక్రవారమూ కొనసాగాయి. ఎపిఎస్ ఆర్‌టిసి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్టుమెంట్ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నేతృత్వంలో జరుగుతున్న ఈ దీక్షల్లో శుక్రవారం ఉదయం ఆఫ్ డ్యూటీ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ రీజనల్ సెక్రటరీ బి.నీలకంఠం మాట్లాడుతూ వెంటనే 1/2019 సర్క్యులర్‌ను అమలు చేసి, రద్దు చేసిన షెడ్యూల్స్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో యూనియన్ నాయకులు పిళ్లా శంకర్రావు, విఎస్ఆర్.మూర్తి, సిపి.కుమార్, ఎన్ఎంయుఎ అన్ని డిపోల కార్యదర్శులు, డివిజనల్ సెక్రెటరీలు, జోనల్ సెక్రెటరీలు పాల్గొన్నారు.

1023వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటికి 1023వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథరావు, ప్రధాన కార్యదర్శి జిఎస్‌కె.అచ్యుతరావు, జిల్లా నాయకులు డాక్టర్ బూసి వెంకటరావు, సిహెచ్.కాసుబాబు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి జగన్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దళిత ద్రోహిగా మిగిలిపోతారని మాజీ ఎమ్మెల్యే, టిడిపి దక్షిణ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ అన్నారు. జగన్‌పై కోడికత్తితో దాడి చేశారని ఆరోపణలు ఎదుర్కొంటూ జైలులో ఉన్న శ్రీనుకి న్యాయం జరగాలని శుక్రవారం ఎవిఎన్ కళాశాల అంబేద్కర్ విగ్రహం వద్ద పలువురు నిరసన తెలిపారు.